క్లుప్తంగా

పాఠశాలల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: మండలంలోని అంతాపూర్, లేండిగూడ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈవో ఆడే ప్రకాశ్ సందర్శించారు. టీచర్, విద్యార్థుల హాజరు పట్టికలతోపాటు ఎండీఎం రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రస్తుతం వానాకాలం ఎండీఎంలో అనేక జాగ్రత్తలు పాటించాలన్నారు. వంటపాత్రలను శుభ్రంగా కడగాలని, కిచెన్ గదిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని పేర్కొన్నారు. తాజా కూరగాయలతో వంటలు చేయాలని తెలిపారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

పెంచికల్‌పేట్: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పెంచికల్‌పేట్ మండల వ్యవసాయాధికారి మనీషా ఒక ప్రకటనలో కోరారు. జూన్ 5లోపు నూతన పట్టాలను పొందిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు కాపీలతో ఎల్కపల్లి రైతు వేదికలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని బలగల గ్రామంలో గల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల– 2లో ఖాళీగా ఉన్న పీసీఈ (ప్లంబర్ కం ఎలక్ట్రిషియన్) పోస్టుకు అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాగు ష్ఫఫిర్‌దోష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ పూర్తి చేసి ఉండాలని, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రోజు వారి పద్ధతిలో వేతన చెల్లింపు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలలో హెడ్ కుక్ పోస్టు భర్తీకి మైనార్టీ లేదా మైనార్టీయేతర పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

జోడేఘాట్‌కు బస్సు ప్రారంభం



జోడేఘాట్‌కు చేరిన ఆర్‌టీసీ బస్సు

కెరమెరి: మండలంలోని కుమురంభీం చారిత్రాత్మక గ్రామం జోడేఘాట్‌కు బుధవారం నుంచి ఆర్‌టీసీ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో జోడేఘాట్ పరిసర 12 గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ టీఎస్‌ఆర్‌టీసీ డీఎం రాజశేఖర్‌కు తమ గ్రామాలకు బస్సు నడపాలని విన్నవించారు. దీంతో బస్సు ప్రారంభించినట్లు కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ తెలిపారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కౌటాల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తహసీల్దార్ ప్రమోద్ కుమార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గుడ్లబోరి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన విద్యతో పాటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హన్మంతు, హెచ్‌ఎం ఆంటోని, ఉపాధ్యాయులు అశోక్, శివాజీ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాపాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పోటీల్లో సత్తా చాటి ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో సుభాష్ బుధవారం తెలిపారు. సంజయ్, అనిరుధ్ ఈ నెల 24న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు విద్యాసాగర్, రాజయ్య, శారద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లులేవి?



ఈ ఇంటి నిర్మాణం ముందు నిలబడ్డ మహిళ కుర్సెంగ కల్పన. ఈమెది కూడా దిగిడ గ్రామం. ఇంటి నిర్మాణం కోసం సుమారుగా లక్షకు పైగానే ఖర్చు చేసింది. అయినా.. బిల్లు రాక పోవడంతో పనులు మధ్యలోనే ఆపేసింది. బిల్లులు సకాలంలో చెల్లిస్తే ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపింది.



ఇక్కడ ఇంటి నిర్మాణం మధ్యలో నిలబడ్డ మహిళ మండలంలోని దిగిడ గ్రామానికి చెందిన కుర్సెంగ పద్మ. జనవరిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పునాది పూర్తి చేసి పిల్లర్ల పోశారు. ఇంటి నిర్మాణానికి ఇప్పటి వరకు సుమారు లక్షన్నరకు పైగా ఖర్చు చేసినా.. బిల్లు రాలేదు. వ్యవసాయ పనులు ప్రారంభమైనవి అప్పు చేసి ఇళ్ళుకు ఖర్చు పెట్టినా అయినా బిల్లులు వస్తలేవు.

- పునాది పూర్తయినా అందని బిల్లులు
- పెట్టుబడికి ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు
- ఫైలట్ గ్రామంగా దిగిడ

దహెగాం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరుణంలో గూడు లేని నిరుపేదలకు గూడు కల్పిస్తామని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. జనవరిలో మండలంలోని దిగిడ గ్రామాన్ని ఫైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ముందుగా ఇంటి నిర్మాణాలకు పెట్టుబడి పెట్టిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు.

24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు..

మండలంలోని గిరిజన గ్రామమైన దిగిడ గ్రామాన్ని ఫైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి జనవరిలో పనులు ప్రారంభించారు. అందులో 15 ఇళ్లు మాత్రమే పునాది లేవల్ పూర్తయ్యాయి. మూడు ఇళ్లు స్లాబ్ వేశారు. మిగతా 9 ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు పెట్టుబడి పెట్టే స్థోమత లేక అవి ముందుకు సాగడం లేదు.

ఆరుగురికే బిల్లులు..

ఇరవై నాలుగు ఇందిరమ్మ ఇళ్లలో 15 ఇళ్ల నిర్మాణం మాత్రమే కొనసాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. మిగతా 9 ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుంది. పునాది లేవల్ 15 ఇళ్లు పూర్తి కాగా అందులో కేవలం ఆరుగురి లబ్ధిదారులకు మాత్రమే లక్ష పేమెంట్ జరిగాయని అధికారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారుల ఖాతాలు సక్రమంగా లేక పోవడం, బ్యాంకుల ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌లు మారడం వల్ల బిల్లులు ఖాతాల్లో జమ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని బిల్లులు సకాలంలో రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బిల్లులు వస్తాయి

దిగిడ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బిల్లులు వస్తాయి. ఇప్పటి వరకు ఆరుగురికి లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది. కొందరి లబ్ధిదారుల ఖాతాలు ఆక్టివ్‌గా లేక పోవడం, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సర్వర్ ఇబ్బంది కారణంగా బిల్లులు జమ కాలేదు. త్వరలో బిల్లులు వస్తాయి. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సందీప్ హౌసింగ్ ఏఈ

రోడ్డుపై గుంతలతో చింత

- అధ్వానంగా పెంచికల్‌పేట్ – సలుగుపల్లి రహదారి
- ప్రయాణానికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా పెంచికల్‌పేట్ - సలుగుపల్లి రహదారి

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపైన పెద్ద గుంతలు ఏర్పడటంతో రోడ్డు గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన మూడేళ్ల నుంచి రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో రహదారిపైన ఏర్పడిన గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణాలు సాగించే వారు సైతం అవస్థలు పడుతూ గమ్యానికి చేరుకుంటున్నారు.

15 కిలోమీటర్లు.. గంట ప్రయాణం..

పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వరకు 15 కిలో మీటర్ల బీటీ రహదారి ఉంది. గుంతలమయంగా ఉన్న రోడ్డు గుండా ప్రయాణం చేయడానికి సు మారు గంటకు పైగా సమయం పడుతోంది. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్సులు సైతం నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్ నుంచి పెంచికల్‌పేట్ మీదుగా బెజ్జూర్‌కు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. గుంతలమయంగా మారిన రహదారిపైన ప్రయాణాలు చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీ గా ఉండే రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు అటువైపు ఎ లాంటి చర్యలు చేపట్టకపోవడంతో అష్టకష్టాలను పడుతూ గమ్యానికి చేరుకుంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికా రులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. గుంతల కారణంగా సమయానికి గమ్యానికి చేరుకోలేక పోతున్నాం. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రయాణికుల ఇక్కట్లు తొలగించాలి.

– సాయి కుమార్, పెంచికల్‌పేట్

అర్హులకు చేయూత పింఛన్లు అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో అర్హులకు చేయూత పింఛన్ అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బుధవారం చేయూత పింఛన్లపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చనిపోయిన పింఛన్‌దారుడి స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులకు పింఛన్ అందించేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సదరం క్యాంపుల్లో 21 రకాల దివ్యాంగ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు గిరిజన గ్రామాల్లో పీఎం జుగా కింద నిర్వహించే శిబిరాలకు పంచాయతీ కార్యదర్శులు హాజరై ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్ కార్డులు లేని గిరిజనులను గుర్తించాలని ఆదేశించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్– 2025 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్, డీఆర్‌డీవో దత్తారావు, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీటీడీవో రమాదేవి, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, డీఎల్‌పీవో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటస్థలం, చిల్డ్రన్‌పార్క్ నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ యూత్ నాయకులు

వాంకిడి: మండలంలోని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డికి వాంకిడి కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేకపోవడంతో నిరుద్యోగ యువకులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే శాశ్వత ఆటస్థలం, చిల్డ్రన్ పార్కు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు జబోరె గణేశ్, దాదాజీ, మల్లయ్య, గుండన్న, తిరుపతి తదితరులు ఉన్నారు.

జీవో 49 వెంటనే రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

లింగాపూర్: ప్రభుత్వం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ కోసం విడుదల చేసిన జీవో 49ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేశ్ నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగరాజుగౌడ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులను భూముల్లో నుంచి వెళ్లగొట్టే ఆలోచనతో ప్రజాప్రతినిధులను సంప్రదించకుండానే జీవో విడుదల చేయడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాదవ్ హిరామన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి



ఖమాన గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

వాంకిడి: ఇందిరమ్మ ఇళ్లను కొలతల ప్రకారం నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పోషం అన్నారు. బుధవారం మండలంలోని ఖమాన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ మాట్లాడుతూ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. విడతల వారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారుల సూచనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం జీవన్, సెల్వట్‌కార్ పెంటు, గంగాధర్, తిరుపతి, లబ్ధిదారులు ఉజ్వల, చేతన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జుగా'తో మౌలిక సదుపాయాలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

కెరమెరి: ప్రధానమంత్రి జన జాతీయ ఉత్కర్ష గ్రామీణ అభియాన్ (పీఎంజుగా) పథకంలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఏటీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని కరంజివాడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య కార్డు, క్రెడిట్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, జన్‌ధన్ అకౌంట్ గ్రామాలకు తాగునీరు, రోడ్డు రవాణా సౌకర్యాలు, పక్కాగృహాలు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ సంతోష్‌కుమార్, ఎస్సీఆర్‌పీ రాథోడ్ నరేశ్, సెక్రటరీ వెంకటేశ్వర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాథోడ్ రవీందర్

కాగజ్‌నగర్ రూరల్: ప్రధానమంత్రి జనజాతీయ ఉత్కర్ష గ్రామీణ అభియాన్ (జుగా) పథకంపై బుధవారం మండలంలోని మారెపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం పర్యవేక్షణ అధికారి రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు ఈ పథకం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. పీఎం జుగా పథకంలో మారెపల్లి గ్రామం ఎన్నిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం పీఎం జన్‌మన్ ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీసీఆర్పీ కుడిమెత అనంత్, పంచాయతీ సెక్రటరీ రాజేశ్వర్, సహజ పాల్గొన్నారు.

మొక్కల్లో కలుపుతీయాలి



పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీవో మల్లయ్య

కెరమెరి: నర్సరీల్లో ఉన్న మొక్కల్లో కలుపు తీయాలని నర్సరీ నిర్వాహకులను ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని వన నర్సరీని ఆయన పరిశీలించారు. కొన్నిచోట్ల ఎండిపోయిన మొక్కలు, స్టంపుల్లో పిచ్చిమొక్కలు ఉండటాన్ని గమనించారు. ఎండిపోయిన మొక్కల చోట ఇతర మొక్కలు నాటాలన్నారు. రెండు, మూడు వానలు పడిన తర్వాత త్వరలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని అప్పటి వరకు భద్రంగా మొక్కలను కాపాడాలని పేర్కొన్నారు.

నేడు మండలస్థాయి ఎంపిక పోటీలు

కౌటాల: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం గురువారం మండలస్థాయి ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో గావుడే హన్మంతు బుధవారం తెలిపారు. 2025–26లో విద్యాసంవత్సరంలో 4వ తరగతిలో ప్రవేశానికి 8 ఏళ్ల లోపు విద్యార్థులు అర్హులన్నారు. నేడు ఉదయం 10 గంటలకు కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 91546 33533 సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న యువకులు

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నిరుపేద మహిళ కోట్రంగి పార్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి బుధవారం యువకులు రూ. 11,200 ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు మోర్లె పాండురంగ్, నికోడే హన్మంతు, విజయ్; చంద్రశేఖర్, కమలాకర్, విలాస్, సురేశ్, బాబురావు, సాయి, చిలుకయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ బలోపేతానికి ప్రతీఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశానికి మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పార్టీ మండలస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుంకరి పెంటు, ఉపాధ్యక్షులుగా ఆత్రం లింగు, జగదీశ్, రావర్తి పోషన్న, ప్రధాన కార్యదర్శిలుగా వెంకన్న, ప్రహ్లాద్, మహిళా కార్యదర్శులుగా రేవతి, తిరుపతమ్మ, లక్ష్మి, కోశాధికారిగా సంతోష్, సభ్యులుగా శంకర్, కళావతి, లావణ్య, సంతోష్, అంబాదాస్, మధుకర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాటూరి జయరాజ్, దీపక్ పంచదార తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



బాలికలకు పల్లిపట్టీలు అందజేస్తున్న అధికారులు

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లోని కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఎన్ రేణుక దేవి అన్నారు. ఇందిరమ్మ అమృతం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని నదీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు పల్లిపట్టీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను తినాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సరుకులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌటాల కార్యదర్శి సాయికృష్ణ, ఏఎన్‌ఎం రజిని, అంగన్‌వాడీ టీచర్ అనిత పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

జైనూర్: రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ ప్రాంత హక్కుల సాధనకు ఐకమత్యంగా పోరాడాలని గోండ్వాన రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు మార్లవాయి రాయిసెంటర్ సార్మెడీ జుగ్నక దేవురావు అన్నారు. ఆదివారం మార్లవాయిలో ఆయా రాయిసెంటర్‌ల సార్మెడీలు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ అంశంపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ సార్మెడీ మెస్రం దుర్గు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సార్మేడీలు మోతీరామ్, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు, సార్మేడీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని ఆదర్శనగర్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనులు కొనసాగిస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ క మలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్, నౌగాం బస్తీ, మార్కెట్ ఏరియా, కౌసర్ మసీద్ ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో చిర్రకుంట ఫీడర్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ ఊర్మిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలాటిగూడ గ్రామం వద్ద నూతనంగా టవర్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నందున చిలాటిగూడ, పాడిబండ, తుంపెల్లి, కోసార, మలన్‌గోంది, చిర్రకుంట గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.